నలుగురూ హోటల్లోకి అడుగుపెట్టారు. అప్పుడే అక్కడికి మోటార్ సైకిల్ మీద ఇనస్పెక్టర్ యాద్గిరి, కానిస్టేబుల్ వచ్చారు.

"సార్ సార్ అటు చూడండి".

హోటల్‌లోకి వెళుతున్న వాళ్ళందరినీ చూపించాడు కానిస్టేబుల్.

"హత్తెరి పోద్గాల ఫోటో చూపిస్తేగా సీత యాడున్నదో తెలియదన్నారు. గిప్పుడు గామెతోనే లోపలికి పోతుండ్రు! జరూర్ ఏదో కిరికిరి వున్నది" అన్నాడు యాద్గిరి.

0 0 0

"వీడు ఏ రూమ్‌లో వుంటున్నాడో చెప్పు" రుస్తుం దాదా రిసెప్షనిస్టు ముందు బుచ్చిబాబు ఫోటో పెడుతూ అడిగాడు.

"ఎందుకు"

కత్తితీసి రిసెప్షనిస్టు పీకమీద పెట్టాడు రుస్తుందాదా.

"ప్రశ్నలు అడక్కు!" కర్కశంగా పలికింది అతని గొంతు.

0 0 0

"హమ్మ పింజారీ వెధవ.. అంత పని చేసావా?" సీత చెప్పిందంతా విని బుగ్గలు నొక్కుకుంటూ అన్నాడు పర్వతాలరావు .

సీత కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

"ఊరుకోమ్మా ఊరుకో...మేం వచ్చేశాంగా! ఇంక నీకే సమస్యా వుండదు" అంది పార్వతమ్మ సీత భుజం తడుతూ.

"జూలీ.....హా హా హా...." అంటూ గుండెలు బాదుకున్నాడు సుందర్.

"నువ్వుండవయ్యా బాబూ నీ గోలొకటి. అసలు నీవల్లే మావాడు పాడయ్యాడు కాస్త నీ ఏడుపాపు" విసుక్కున్నాడు పర్వతాలరావు .

0 0 0

గది తలుపులు విసురుగా తెరుచుకున్నాయి.

బుచ్చిబాబు తల త్రిప్పి గుమ్మం వైపు చూసాడు.

రుస్తుందాదా

బుచ్చిబాబు గుండె పొట్టలోకి జారిపోయింది.

రుస్తుందాదా గది తలుపులుదగ్గరికి జారేసి ఒక్కొక్క అడుగే బుచ్చిబాబు వైపు వెయ్యసాగాడు. అతని చేతిలో తళతళలాడే పదునైన కత్తి.

"ఏ...ఏ...ఏంటది..నన్నెందుకు చంపాలని అనుకుంటున్నావు?" తడారిపోయిన గొంతులో అన్నాడు బుచ్చిబాబు .

"మినిస్టర్ మిన్నారావుతో నకరాల్ చేస్తావా?" పళ్ళు నూరాడు రుస్తుందాదా.

"మినిస్టర్ మిన్నారావా? ఆయనతో నేనేం నకరాల్ చేసాను? నేనే పాపం ఎరగను " భయం భయంగా అన్నాడు బుచ్చిబాబు .

"ఏమో నాకు తెలీదు. నిన్ను సఫా చేయమని మినిస్టర్ మిన్నారావ్ నన్ను పంపించాడు". మరో రెండడుగులు ముందుకు వేసాడు రుస్తుందాదా.

"ప్లీజ్ దాదా నన్నేం చేయకు దాదా" బుచ్చిబాబు వణికిపోతూ బ్రతిమిలాడాడు.

"ఈ రుస్తుందాదా ఒకసారి కాంట్రాక్టు ఒప్పుకుంటే వెనక్కి వెళ్ళడు" అంటూ హఠాత్తుగా ముందుకు దూకి బుచ్చిబాబు పీక పట్టుకుని కత్తిని పైకెత్తాడు.

అదే సమయంలో రూంలోకి పర్వతాలరావు, పార్వతమ్మ, సీత, రాధ, సుందర్ అందరూ సుడిగాలిలా వచ్చారు.

వస్తూనే లోపలి సీన్ చూసి అందరూ కోరస్‌గా కెవ్వుమని అరిచారు.

ఆ అరుపుకి రుస్తుందాదా ఉలిక్కిపడ్డాడు. మళ్ళీ తేరుకుని "ఎవరు మీరంతా?" అని కర్కశంగా అడిగాడు.

"మేమెవరైతే నీకెందుకురా పింజారీ వెధవా....మావాడిమీద ఈగ వాలినా నేనూర్కోను. ముదనష్టపు వెధవా, సెన్నా సెదవా, ఏబ్రాసెదవా, దరిద్రపు గొట్టెదవా, తింగరెదవా, కునిష్టి ఎదవా, పనికి మాలిన..." ఆవేశంతో నాన్‌స్టాప్‌గా తిట్టసాగాడు పర్వతాలరావు.

"ఆగెహె!" గట్టిగా అరిచాడు రుస్తుందాదా.

పర్వతాలరావు తిట్టడం ఆపి ఊపిరి పీల్చుకున్నాడు.

"నేనెవరో నీకు తెలీదు. ఈగ వాలడం కాదు ఈడి గుండెల్లో కత్తెదిగుద్ది! ఎవడు అపుతాడో చూస్తా" అంటూ ఆవేశంగా కత్తిని పైకెత్తాడు రుస్తుందాదా.

బుచ్చిబాబు గది గోడలు బీటలు వారాలే "బాబోయ్" అని అరిచాడు.

మిగతా అందరూ కెవ్వుమని కోరస్‌గా అరిచారు.

అదే సమయంలో "ఢాం" అని రివాల్వర్ పేలింది.

రుస్తుందాదా చేతిలోని కత్తి ఎగిరి దూరంగా పడింది. అందరూ తలలు తిప్పి చూసారు. ఇనస్పెక్టర్ యాద్గిరి గది గుమ్మంలో నిలబడి వున్నాడు. అతని చేతిలోని రివాల్వర్ పొగలు కక్కుతూ వుంది. అతని ప్రక్కన ఏకాంబరం వున్నాడు.

బుచ్చిబాబు ఇల్లు

పర్వతాలరావు, పార్వతమ్మ, సీత, రాధ, సుందర్, ఏకాంబరం అందరూ కూర్చుని వున్నారు. వాళ్ళందరి మధ్యా బుచ్చిబాబు నేరస్థుడిలా తల వంచుకునివున్నాడు. అందరూ అతనికి క్లాస్ తీసుకుంటున్నారు. ముఖ్యంగా రాధ!

"చెప్పండి బుచ్చిబాబుగారు! మీ ఆదర్శంవల్లా మీకేమైనా ఆనందం కలిగిందా? ఇరవై నాలుగ్గంటలూ మీకు టెన్షనేకదా! పోని మీ ఆదర్శాన్ని మీరు అంత గట్టిగా నమ్మినప్పుడు, కలసి జీవిస్తున్నాం అని. సీత మీ భార్య కాదని తెలియగానే మీకు స్నేహితుడనుకున్న మోహనే చూసారా సీతతో ఎలా మిస్ బిహేవ్ చేశాడో? ఆఖరికి తండ్రి వయసున్న ఏకాంబరం కూడా సీతతో పిచ్చివేషాలు వెయ్యాలనే ప్రయత్నించాడు. వాళ్ళ సంగతి సరే. ఆఖరికి పాలవాడికి, న్యూస్‌పేపర్ బోయ్‌కి కూడా సీత లోకువయిపోయింది. సీతని ఒక రాత్రికి బుక్ చేసుకోవాలని మరో దరిద్రపు వెధవ వచ్చాడు. మీరు ఎంతగానో ప్రేమించిన సీతని అందరూ ఇంతనీచమైన దృష్టితో చూస్తుంటే మీకు బాగుందా?"రాధ ఆవేశంగా అడిగింది.

అయినా బుచ్చిబాబు ఉలకలేదు, పలకలేదు.

"మాట్లాడవేంరా పింజారీ వెధవా...పీక పిసికి చంపుతా" ఆవేశంతో ఊగిపోయాడు పర్వతాలరావు .

"పాపం! ఆ అమ్మాయిని ఎంత కష్టపెట్టావురా" బాధగా అంది పార్వతమ్మ .

"నన్ను షూడరా బుష్షీ, నాకు ఆ జూలీ ఎంటలెషన్ షెప్పిందో. జూలీని రాబర్ట్ టీషుకుని పోయినాడు. అదే జూలీ నా భార్య అయిన అటుల వేరేవానితో పోవునా?"
అన్నాడు సుందర్.

"అయినా విదేశాల్లో వాళ్ళ సంస్కృతి వేరు. మన సంస్కృతి వేరు. అక్కడి పద్ధతులు ఇక్కడ అచరించాలంటే ఎలా కుదుర్తుందండీ బుచ్చిబాబుగారు!" అంది రాధ.

బుచ్చిబాబు ఇంకా సైలెంట్‌గానే వున్నాడు.

అంతదాకా నిశ్శబ్దంగా వున్న సీత ఆవేశంగా అంది.

"మనం ఎన్ని చెప్పినా అతను మారడు లేవే....కానీ అతని ఆదర్శం కోసం నేనింక బాధలు పడలేను. ప్రతి అడ్డమైన వెధవా నన్ను నీచంగా చూస్తే నేను సహించలేను. అందుకే నేనోక నిర్ణయానికొచ్చా"

రెండు క్షణాలు ఆగింది సీత "నేనంటే నవీన్‌కి చాలా మంచి అభిప్రాయం వుంది. నన్ను పెళ్ళి చేసుకోవడానికి అతను సిద్దంగా వున్నాడు. నన్ను ప్రేమించానంటూ అందరి దృష్టిలో నన్ను నీచం చేసేవాడికంటే నన్ను పెళ్ళి చేసుకుని సంఘంలో నాకో విలువ కల్పించేవాడే నాకు ముఖ్యం! అందుకే నవీన్‌ని చేసుకోవాలని అనుకుంటున్నాను".

సీత అ మాట అనగానే బుచ్చిబాబు చివాలున తల యెత్తాడు.

అతని కళ్ళలో నీళ్ళు!

చటుక్కున సీత రెండు చేతులు పట్టుకుని "సారీ సీతా! నువ్వు లేకుండా నేను బతకలేను.

నేను చేసిన తప్పు తెలిసింది. మనం పెళ్ళి చేసుకుందాం" అన్నాడు బ్రతిమిలాడుతూ.

సీత తన చూపుడు వేలితో అతని కన్నీళ్ళు తుడిచింది. అక్కడ వున్న అందరూ తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు.

0 0 0

సీతా, బుచ్చిబాబుల వివాహం రెండు వారాల తరువాత ఒక మంచి ముహూర్తాన జరిగింది.

రుస్తుందాదాను పోలీసులు ఇంటరాగేషన్ చేసి బుచ్చిబాబు హత్య కోసం అతన్ని నియమించింది మినిస్టర్ మిన్నారావ్ అని తెలుసుకున్నారు. తీగ లాగితే డొంకంతా కదిలినట్టు రాజేంద్ర హత్యా రహస్యం బయటపడి మినిస్టర్ మిన్నారావ్ కటకటాల వెనక్కి వెళ్ళాడు.

సుందర్ పోనీటెయిల్ కట్ చేయించేసుకుని మామూలు క్రాపింగుతో మామూలు తెలుగు మాట్లాడుతూ ఇండియాలోనే సెటిల్ అయిపోయాడు. అంతేకాదు.... రాధా సుందర్‌ల మధ్య పరిచయం పెరిగి అది ప్రేమగా మారి వాళ్ళిద్దరు కూడా పెళ్ళి చేసుకున్నారు.

ప్రస్తుతం బుచ్చిబాబు సీతతో హాయిగా కాపురం చేసుకుంటున్నాడు. ఆ విధంగా సిల్లీఫెలో సంసారి అయి తరువాత భార్య విధేయుడిగా మారి ఓ మంచి భర్తగా పేరు తెచ్చుకున్నాడు.